
**'ఆటా' కథల పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

# మట్టి తడుస్తున్న వాసన



-డా. కాలువ మల్లయ్య

గలగలా వాన... బొలబొలా వాన... కుండపోతగా వాన... మన్నూ మిన్నూ ఏకమవుతున్నట్టుగా వాన...

వాన... వాన...వాన... ఆకాశానికి చిల్లులు పడ్డట్టుగా... చెంబులతో కుమ్మరిస్తున్నట్టుగా వాన...

గుడిసె కమ్మీలు తడిసిముద్దయి ఎనగర్ర నుండి జలజలా ఉరుస్తుంది... గూన పెంచలనుండి జాలువారి చూరు గుండా బొలబొలా కుమ్మరిస్తుంది... గుట్టలపై నుండి పొంగి పొర్లుతూ ఒర్రెల్లోకి... కాలువల్లోకి... కుంటల్లోకి... చెరువుల్లోకి మనోవేగంతో పరుగెత్తుకొస్తున్న నీళ్ళు... సెలయేళ్ళు ఉప్పొంగి జోరుజోరుగా తన్నుకొస్తున్న ప్రవాహం... వాన...వాన... నదులు ఉప్పొంగుతున్నాయి... ఎన్ని ప్రవాహాలొచ్చినా సముద్రం తనలో సంలీనం చేసుకుంటుంది...

వాన... బజార్ల వెంటున్న మురికినంతా తన్నుకుపోతూ వీధులను శుభ్రంచేస్తున్న వాన... ఎడతెరపి లేకుండా వాన... ఫెళఫెళా కూలుతున్న చెట్లు... భూమికి పుండయి మెత్తమెత్తగా పూట పండులా ధరణి... సందు సందుల్లోకి చొచ్చుకుపోతున్న నీళ్లు... మూల మూలల్లోకి... భూగర్భంలోకి... లోలోతుల్లోకి పోతున్న నీళ్లు... ఇంకుతూ భూమిని మెత్తపరుస్తూ లోలోపల్నుండి పైకివస్తున్న నీళ్లు... బావుల్లో చెంబుతో ముంచుకోగలిగేంత పైపైకి తన్నుకొస్తున్న నీళ్లు...

తడుస్తుంది... భూమంతా తడుస్తుంది... సందులేకుండా తడుస్తుంది... పాతాళం లోతువరకు తడుస్తుంది... వాన కురుస్తూనే ఉంది... వానలో తడిసి ముద్దయిన గొల్ల బోయేలు... శరీరం పైనుండి ధారాపాతంగా నీల్లు కారుతుండగా పరుగెత్తుకొస్తున్న పశుల పోరగాండ్లు... చెంగలిస్తూ పరుగులు తీస్తున్న కోడె దూడలు... చూరు నీడలకు చొంగ కారుస్తున్న కుక్కలు... వానకు తడిసి రెక్కలను టపటప కొట్టుకుంటున్న పక్షులు... చలికి వణుకుతూ గొర్రె బొక్కలు... చింత చెట్టు నెర్రల్లో పిచ్చుకలు-

రెండురోజులుగా నిర్విరామంగా కురుస్తున్న వాన వెలిసింది.

కప్పల బెకబెకలు... ఎండ్రికాయల పాకడాలు...కాకులు కలుసు కోవడాలు... కుప్పలు తెప్పలుగా ఉసిళ్ళు... హర్షాతిరేకంతో పులకించిపోతూ పక్షులు... ఆకాశానికి ఎర్రడాలు పడింది...

ఏడు రంగుల ఇంద్ర ధనుస్సు అందంగా ఆహ్లాదకరంగా ఆకాశం నిండా పరుచుకొనుంది.

"ఓ దిక్కు దెశలేని వర్షం... నువ్వేమొ అరుగుమీద కూచోని ఏదో ఆలోచిస్తున్నవు... భలే రైతువున్నవే కొంరన్న...! చెరువు నిండిందని అందరు చూడటానికి పోతున్నరు... పోదాం పా... ఇంట్ల కూచోని ఏం చేస్తవు...?"

అన్నాడు వాకిట్లోకి అడుగుపెడుతూ వీరమల్లయ్య...

"రా... రా... వీరమల్లయ్య! ఏం జేస్తున్నవంటె ఏం జెప్పుమంటవు...? వానను చూసుకుంట కూసున్న... రొండ్రోజుల్నుంచి వశపడని వానతోని పనే సాగకపాయె... ఇయ్యాల్లనన్న నాగలి గట్టుకోని పోవద్దా...? చెరువును చూసేదేముంది...?"

అన్నాడు కొంరయ్య లేచి నిల్చుంటూ...

"భలేటోనివున్నవే కొంరన్న...! ఇప్పుడు నాగలి గట్టుకోని పోతవా...? పొలం దున్నుతవా...? ఎక్కడ చూసినా నీళ్ళే నాయె... నీళ్ళల్ల ఎట్ల దున్నుతవో చెప్పు...! పని సాగన్నంటె రేపటిదాకనన్న ఆగాలె... గడియ రికాం లేదు గవ్వరాకట్లేదన్నట్లున్నయి నీ మాటలు... వానసక వరదనక దున్నుతాంటె వస్తది పటు ఇంత పొడుగు పంట..." అన్నాడు అరుగెక్కుతూ వీరమల్లు...

"అట్లంటేమన్నట్టు వీరమల్లు...? ఏం వస్తుంది వస్తలేదని చూస్తమా మనం...? వ్యవసాయం చేయడం మన బాధ్యత. వ్యవసాయమంటె బేపారం కాదుగద...! లాభాలు నష్టాలని చూసుకుంటుంటె నడుస్తదా...? వ్యవసాయంతోని బాగ సంపాయించుత లేం కావచ్చు కాని దానిమీద బతుకుతున్నమా...? లేదా...? సరెగని మంచాల కూసో..."

"ఆ మాట నిజమేనే కొంరన్న... ఇప్పుడు కూచునుడెందుకు కాని చెరువు దిక్కుపోదాం పా... ఇయ్యాల్ల పనెట్లయిన సాగది..." "అంతేనంటవా...? సరే పోదాం పా..."

మాట్లాడుకుంటూ చెరువుదిక్కు నడుస్తున్నారు వాళ్ళు...

"అబ్బబ్బ...! ఏం వానే ఇది... ఊరగాలువ నుంచే మోకాలు మంటి నీల్లు పోతున్నయి... పొలాలల్ల జూడు నీటివరుదెట్లుందో... అగో... ఒర్రె బొర్లుతుంది... తొవ్వ పొంటి ఉసిల్లు కుప్పలు కుప్పలుగ ఎట్ల పడున్నయో సూడు... అగో... చెరువు కింది కాలువల బెస్తవాళ్ళు చేపలు పడుతున్నరు... చేపలెట్ల ఎదురెక్కి వస్తున్నయో సూడు... తోపెలలు, కప్పగాలాలు వాడుతుండ్రు గద..."

"అవ్వన్ని మామూలేకద వీరమల్లు... రొండ్రోజుల్నుంచి ఉతికింది ఉతికినట్టేనాయె వాన... అందుకే వాన రాకడ పానం బోకడ తెలువదన్నరు...సరెగని చెరువు నిండిందంటవా...?"

"ఇంకెక్కడున్నవే కొంరన్న నువ్వు...? అగో... అలుగుల మోత వినస్తలేదా...? చిన్న మత్తడి, పెద్దమత్తడి మీదినుండి నీళ్ళు పొంగి పొర్లుతున్నయి..."

"భలేటోనివున్నవే కొంరన్న...! ఇప్పుడు నాగలి గట్టుకోని పోతవా...? పొలం దున్నుతవా...? ఎక్కడ చూసినా నీళ్ళే నాయె... నీళ్ళల్ల ఎట్ల దున్నుతవో చెప్పు...! పని సాగన్నంటె రేపటిదాకనన్న ఆగాలె... గడియ రికాం లేదు గవ్వరాకట్లేదన్నట్లున్నయి నీ మాటలు... వానసక వరదనక దున్నుతాంటె వస్తది పటు ఇంత పొడుగు పంట..."

